క్లుప్తంగా

క్రీడా పరికరాల పంపిణీ



విద్యార్థులకు ఆట వస్తువులు పంపిణీ చేస్తున్న పూర్వ విద్యార్థి

ఆదోని సెంట్రల్: మండలంలోని 104 బసాపురం గ్రామ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు పూర్వ విద్యార్థి సోమేష్ క్రీడా పరికరాలను గురువారం పంపిణీ చేశారు. ఆయన ఇటీవల లండన్‌లో ఉన్నత విద్యను పూర్తి చేసుకొని వచ్చారు. మిత్రులు లింగప్ప యాదవ్, మల్లికార్జున, గోవర్ధన్, మంజు, మల్లయ్య, వీరేష్‌తో కలసి తాము చదువుకున్న పాఠశాల విద్యార్థులకు ఇండోర్ గేమ్స్ ఆడడానికి అవసరమైన షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు.

వలసలను నివారించడంలో కేంద్రం విఫలం

ఆదోనిరూరల్: నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో వలసలను నివారించడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విఫలమైందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు విమర్శించారు. గురువారం సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లింగన్నతో కలిసి మండలంలోని జాలిమంచి గ్రామంలో వలస వెళ్లిన కూలీల ఇళ్లను పరిశీలించారు. గ్రామంలో ఎస్సీ కాలనీలోని 120 కుటుంబాలకు గానూ 80 కుటుంబాలు వలసబాట పట్టారన్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల కరువు, కాటకాలు ఏర్పడ్డాయని, ఇక్కడ చేయడానికి పనులు లేక, రైతులు, కూలీలు దాదాపు 400 మందికి పైగా గుంటూరు, బెంగళూరు, హైదరాబాద్ పట్టణాలకు వలస వెళ్లారని చెప్పారు. కూలీలకు వెంటనే ఉపాధి పనులను కల్పించి, గిట్టుబాటు వేతనం అందజేయాలని కోరారు. నాయకులు తిమ్మారెడ్డి, స్థానికులు వెంకటేష్, నాగేంద్రమ్మ, ఈరమ్మ పాల్గొన్నారు.

ఘనంగా గ్యారతారీఖ్ వేడుకలు



స్వామి వారి సమాధి వద్ద ప్రార్థనలు చేస్తున్న ధర్మకర్త

కౌతాళం: మండల కేంద్రంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్ లింగ స్వామి దర్గాలో గురువారం గ్యారతారీఖ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక ఫాతెహాలు, ప్రార్థనలు చేశారు. దర్గా పరిసరా ప్రాంతాల్లో భక్తులతో సందడి నెలకొంది. గురువారంతో పాటు గ్యారతారీఖ్ వేడుకలు కలిసి రావడంతో దర్గాకు భక్తులు అధికంగా వచ్చారు. అంతకు ముందు తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాష చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు. పలువురు భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు. భక్తులందరికీ ధర్మకర్త అన్నదానం చేశారు.

సచివాలయ పనుల పరిశీలన

కోసిగి: ప్రభుత్వ కార్యాలయ భవనాల నిర్మాణంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని క్వాలిటీ కంట్రోల్ అధికారి డీఈ హెచ్‌డీ ఈరన్న హెచ్చరించారు. గురువారం మండలంలోని వందగల్లు గ్రామంలో రూ.40 లక్షలతో చేపట్టిన సచివాలయ కార్యాలయ భవనం నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోసిగి మండలంలోని 19 గ్రామ సచివాలయాలు, 17 ఆర్బీకేలు, 14 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లీనిక్‌లు, నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. నిర్మాణాలను ప్రభుత్వం సూచించిన నాణ్యతాప్రమాణాల ప్రకారం నిర్మించాలన్నారు. నాణ్యత లోపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పంచాయతీ రాజ్ ఏఈ యుగంధర్ రెడ్డి తదితరులు వెంట ఉన్నారు.

హెచ్‌ఐవీపై అప్రమత్తంగా ఉండాలి

ఆదోనిరూరల్: ప్రజలు హెచ్‌ఐవీ పట్ల అప్రమత్తంగా ఉండాలని మంజుల కళాజాతా బృందం సభ్యులు తెలిపారు. గురువారం మండలంలోని ఢణాపురం గ్రామంలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ సంస్థ కర్నూలు వారి ఆధ్వర్యంలో వీధి నాటకాల ద్వారా హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తి, నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సర్పంచ్ పాతింటి చంద్రశేఖర్, గ్రామపెద్దలు, చైల్డ్ ఫుడ్ ఇండియా ప్రతినిధులు జోనల్ సూపర్‌వైజర్ హెచ్.రామాంజనేయులు పాల్గొన్నారు.

గ్రామ సేవకుడి మృతి

కోసిగి: మండల పరిధిలోని అగసనూరు గ్రామ సేవకుడు తలారి మారెయ్య (55) గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ మురళీ, డిప్యూటీ తహసీల్దార్ రుద్రగౌడ సంతాపం ప్రకటించారు. వారి తరపున వీఆర్వోల సంఘం నాయకులు బసవరాజు, రాఘవేంద్ర గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి సంతాపం తెలిపారు. రెవెన్యూ శాఖ తరపున రూ.15 వేలు ఆర్థిక సాయంను భార్య అంజినమ్మకు అందజేశారు. మృతుడికి ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు.



కళాశాలలో రూపుదిద్దుకున్న వరండా



ఐటీఐ ఉర్దూ కళాశాలలో హాస్టల్ వసతి గది



ఆరేకల్ గ్రామం వద్ద నిర్మించిన మైనార్టీ ఉర్దూ కళాశాల భవనం

ప్రారంభానికి సిద్ధం

- ముస్తాబవుతున్న ఆరేకల్ మైనార్టీ బాలికల ఐటీఐ ఉర్దూ కళాశాల
- రూ.4 కోట్లతో కళాశాల, వసతి గృహం నిర్మాణం
- వంద మంది విద్యార్థినులకు బోధన

ఆదోనిటౌన్: మండలంలోని ఆరేకల్ సమీపంలో మైనార్టీ ఉర్దూ ఐటీఐ కళాశాల, హాస్టల్ వసతి భవనాలు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. రూ.3,91,59,000తో చేపట్టిన ఐటీఐ మైనార్టీ కళాశాల, వసతిగృహం నిర్మాణం పనులు పూర్తి కావచ్చాయి. వంద మంది విద్యార్థులకు ఈ ఐటీఐ కళాశాల విద్యనందించనుంది. కళాశాల భవనం ప్రారంభం కాగానే టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ సిబ్బంది, ఫర్నీచర్, తదితర వసతులను సమకూర్చనున్నామని అధికారులు పేర్కొంటున్నారు. త్వరలోనే ఉర్దూ ఐటీఐ కళాశాల ప్రారంభంతో ముస్లీం, మైనార్టీల విద్యార్థుల కల సాకారం కాబోతోంది. భవన నిర్మాణాలకు ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి కృషి చేశారని వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ నియాజ్ అహ్మద్ తెలిపారు.



ఐటీఐ మైనార్టీ కళాశాల ఆవరణలో నిర్మించిన భవనం

ఘనంగా విద్యావరణ్యస్వామి జాతర



ఉచ్ఛయాన్ని ఊరేగిస్తున్న భక్తులు

ఆదోనిరూరల్: మండలంలోని పర్వతాపురం గ్రామంలో వెలసిన విద్యావరణ్యస్వామి మఠంలో గురువారం సద్గురు పరమహంస విద్యావరణ్యస్వామి జాతరను గురువారం నిర్వహించారు. ఉదయం స్వామివారికి గంగపూజ, హోమం, ఆకుపూజ, అభిషేకం తదితర ప్రత్యేక పూజలు చేపట్టారు. ప్రస్తుత పీఠాధిపతి మురళీధర స్వామి వారిని ఉచ్ఛయంపై ఆశీనులు గావించి ఊరేగించారు. మధ్యాహ్నం వచ్చిన భక్తులకు అన్నదానం చేపట్టారు. గ్రామపెద్దలు, భక్తులు వెంకోబ, హలిగేర నారాయణప్ప, కుమార్‌స్వామి, ఈరన్న, మారెన్న పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



రూ.లక్ష చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

కోసిగి: మండల పరిధిలోని మూగలదొడ్డి గ్రామానికి చెందిన బంగి నర్మద, సిద్ధు దంపతుల కుమారుడు అద్విక్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ. లక్ష సాయం మంజూరైంది. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే స్వగృహంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి చేతుల మీదుగా రూ.లక్ష చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. ఆ కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. చిన్నారి అద్విక్‌కు రెండేళ్ల వయస్సు. పుట్టుకతోనే మతిస్థిమితం లేక ఇబ్బందులు పడుతున్నారు. కర్నూలు, హైదరాబాద్‌లోని పలు ఆస్పత్రులలో వెళ్లి వైద్య పరీక్షలు చేయించి ఆర్థికంగా నష్టపోయారు. ఎమ్మెల్యే సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా రూ.లక్ష మంజూరైంది. గురువారం ఎమ్మెల్యే వారికి చెక్కును అందజేశారు. చిన్నారి వైద్యం కోసం సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. దీంతో ఆ కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు సోమేష్, అంజినయ్య, ఉసేని, ఈరన్న, నాగేంద్ర, ప్రహ్లాద తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా వాహనాల వేలంపాట



వేలంపాట నిర్వహిస్తున్న సెబ్ అధికారులు

కోసిగి: స్థానిక సెబ్ కార్యాలయం పరిధిలోని కోసిగి, పెద్దకడబూరు మండలాలలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను జిల్లా స్పెషల్ అసిస్టెంట్ సెబ్ అధికారి వినోద్‌కుమార్ సమక్షంలో బహిరంగ వేలం నిర్వహించారు. గురువారం కోసిగి సెబ్ కార్యాలయం ఆవరణలో సీఐ మహబూబ్ బాషా, ఎస్‌ఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో వేలంపాట జరిగింది. గతే ఏడాది కాలంలో అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడిన 28 వాహనాలను వేలం వేశారు. వాహనాలకు ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.1,77,300 కాగా పాటదారులు పోటీపడి వేలంలో వాహనాలను దక్కించుకున్నారు. 18 జీఎస్టీతో కలిపి రూ.3,18,196 ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల నేపథ్యంలో కర్ణాటక చెక్‌పోస్టుల వద్ద భారీ బందోబస్తు, ప్రత్యేక నిఘా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అక్రమంగా మద్యం, డబ్బు తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సెబ్ హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, పోలీసులు ఉన్నారు.

1న గిరకబండి పోటీలు



ఆర్గనైజర్స్‌కు నగదు విరాళం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు పి.మురళీమోహన్ రెడ్డి

కోసిగి: కోసిగి ప్రజల ఆరాధ్య దైవం రేణుకా ఎల్లమ్మవ్వ జాతర సందర్భంగా కోసిగిలో మండల స్థాయి గిరకబండి ఎడ్ల పోటీలకు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి నగదును విరాళంగా అందజేశారు. గురువారం ఎమ్మెల్యే తరపున వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి పి.మురళీమోహన్ రెడ్డి పోటీల ఆర్గనైజర్స్‌కు నగదును అందజేశారు. ఆర్గనైజర్స్ శ్రీరామ్, లక్ష్మీరెడ్డి, బాబు మాట్లాడుతూ జాతర పురస్కరించుకుని మార్చి 1వ తేదిన 9 గంటలకు కోసిగి భూగేని చెరువు సమీపంలో పోటీలు ప్రారంభం అవుతాయన్నారు. గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.21 వేలు, ద్వితీయ బహుమతి రూ.15 వేలు, తృతీయ బహుమతి రూ.10 వేలు, నాల్గవ బహుమతి రూ.5 వేలు నగదు అందజేయనున్నట్లు తెలిపారు. ఎంపీపీ ఈరన్న, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు బెట్టన గౌడ, నరసింహులు, వెంకటేష్, లోకారెడ్డి, ఆర్గనైజర్స్ శివరాజు, మాన్వి ఈరన్న, పెద్ద నరసింహులు ఉన్నారు.

శేషవాహనంపై చెన్నకేశవ స్వామి



స్వామివారికి శేషవాహన సేవ నిర్వహిస్తున్న ఆలయ ఈఓ, భక్తులు

దేవనకొండ: మండలంలోని కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్ట్‌లో వెలసిన శ్రీలక్ష్మి కౌలుట్ల చెన్నకేశవ స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం స్వామివారికి శేషవాహన సేవ చేపట్టారు. స్వామి, అమ్మవార్లను శేషవాహనంపై ఉంచి ఆలయ పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ చైర్మన్ ఆర్.హనుమంతరెడ్డి, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి భక్తుల సమక్షంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

మహిళల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మహిళలకు మెగా చెక్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే సాయి, ఎమ్మెల్సీ మధుసూదన్



ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిరూరల్: మహిళల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక డీఆర్‌డీఏ వెలుగు కార్యాలయం వద్ద వైఎస్సార్ ఆసరా 4వ విడత కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో 1,174 గ్రూపులకు గానూ రూ.5.17 కోట్లు ప్రభుత్వం అందజేసిందన్నారు. 2019 ఎన్నికలకు ముందు డ్వాక్రా మహిళలు బ్యాంకుల్లో తీసుకున్న అప్పును విడతలవారీగా మాఫీ చేస్తానని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన మాట మేరకు పథకాన్ని అమలు చేసి మాట నిలబెట్టుకున్నారన్నారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ విజయశేఖర్‌రావు, ఏపీఎం జనార్ధన్, సీసీలు పాల్గొన్నారు.

ఈద్గా నిర్మాణానికి ఆర్థిక సాయం..

ఆదోనిటౌన్: పట్టణంలో ఈద్గా నిర్మాణానికి ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి గురువారం రూ.20లక్షల చెక్కు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఈద్గా నిర్మాణం కోసం సీఎంను కలిసి నిధులు మంజూరు చేయిస్తానని, అంతవరకు పనులు ఆగకుండా కొనసాగించేందుకే సాయం అందించానని చెప్పారు. మతపెద్దలు అఫీజ్‌ఖాన్‌హాజీ, మార్కెట్‌యార్డు చైర్మన్ మజర్‌అహ్మద్, షఫీఉల్లా, అహ్మద్‌బాషా, ఇస్మాయిల్, రెహమాన్ పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్నాం

ఆదోనిటౌన్: ఎన్నికల ముందు పేదలకు ఇచ్చిన హామీ మేరకు ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్లు మంజూరు చేసి మాట నిలబెట్టుకున్నామని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు. జగనన్న పాలనలో ఏ ఒక్కరు కూడా తాము అర్హులైనా పథకం వర్తించలేదనకూడదనే ఉద్దేశంతో అర్హులందరికీ పథకాలు అందజేస్తున్నామని చెప్పారు. గురువారం పట్టణంలోని 31వ వార్డులో 40 మంది, 33వ వార్డులో 73 మంది మహిళలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో రూ.2100 డీడీలు కట్టిన వారితో పాటు అప్పట్లో అందుబాటులోనూ ఇతరత్రా కార్యక్రమాల కోసం వెళ్లిన పేదలను గుర్తించి వారికి కూడా పట్టాలను పంపిణీ చేస్తున్నామన్నారు. సూపర్ సిక్స్ స్కీంలంటూ టీడీపీ, జనసేన పార్టీల నాయకులు వస్తారని, వారికి ఓటు అనే ఆయుధంతో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. 14 యేళ్లు సీఎంగా కొనసాగిన చంద్రబాబునాయుడు ఏమి చేశారని ప్రజల ముందుకొస్తున్నారని ప్రశ్నించారు. పార్టీ పట్టణ గౌరవాధ్యక్షులు చంద్రకాంత్‌రెడ్డి, కౌన్సిలర్లు కిశోర్, లక్ష్మన్న పాల్గొన్నారు.



ఈద్గా నిర్మాణానికి రూ.20 లక్షల చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

గిట్టుబాటు ధర కల్పించడంలో బీజేపీ విఫలం

ఆదోని సెంట్రల్: రైతులకు గిట్టుబాటు ధరలను కల్పించడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నీలకంఠప్ప విమర్శించారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిట్టుబాటు ధర కల్పించాలని ఉద్యమిస్తున్న రైతుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం గర్హనీయమన్నారు. వారి ఉద్యమాన్ని అణగదొక్కాలని, ఇందుకు అన్ని రకాల దుర్మార్గపు చర్యలకు పాల్పడుతుందని మండిపడ్డారు. నాయకులు మారుతీరావు, దిలీప్, సాయినాథ్, జయరాం, రామన్న యాదవ్, హనుమంతు, నిసార్, మద్దిలేటి, విజయరాజు, అహ్మద్ పాల్గొన్నారు.

కోలుకోలేక యువకుడి మృతి



కుమ్మరి విజయ్ (ఫైల్)

నందవరం: మండల పరిధిలోని ముగతి గ్రామానికి చెందిన కుమ్మరి విజయ్ (24) చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. ఈ నెల 16న ఎమ్మిగనూరు పట్టణంలోని 167 జాతీయ రహదారిపై కమిటీ రోడ్డులో రాంగ్ రూట్‌లో వస్తున్న బొలెరో వాహనం విజయ్ బైక్‌ను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన విజయ్‌ను స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా కోలుకోలేక గురువారం విజయ్ మృత్యువాత పడ్డాడు. తండ్రి కుమ్మరి నాగన్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

27 నుంచి శ్రీశైల పాదయాత్ర భక్తులకు అన్నదానం

ఆదోనిఅర్బన్: ఈనెల 27వ తేదీ నుంచి ఆదోని మీదుగా శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్లే శివ భక్తులకు పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల రహదారిలోని బైపాస్ రోడ్డులో అల్కూరు మఠం మహర్షి విజయ్‌కుమార్‌స్వామి కుటుంబ సభ్యులు, దాతల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు గురువారం తెలిపారు. ఈనెల 27 నుంచి మార్చి 2వ తేదీ వరకు ఉదయం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు అన్నదానం ఉటుందని చెప్పారు.

కబడ్డీ విజేత మిద్దెపల్లె జట్టు

కృష్ణగిరి: మండల పరిధిలోని ఆలంకొండ గ్రామంలో దస్తగిరయ్య స్వామి ఉరుసు సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో డోన్ మండలం మిద్దెపల్లె జట్టు విజేతగా నిలిచింది. గురువారం జరిగిన ఫైనల్ పోటీల్లో మిద్దెపల్లె, చిట్యాల జట్లు మొదటి, రెండవ స్థానాలు కైవసం చేసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో 45 జట్లు పాల్గొన్నాయి. విజేతలకు దాతలు పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, చాకలి నాగేశ్వరరావు, మహబూబ్‌బాషా, శేఖర్ సహకారంతో కమిటీ సభ్యులు, ఎమ్మెల్యే తరఫున వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆర్బీ వెంకటరాముడు వరుసగా రూ.25 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.4 వేలను అందజేశారు.

వాహనాల వేలంలో రూ. 10 లక్షల ఆదాయం

ఎమ్మిగనూరురూరల్: స్థానిక సెబ్ సర్కిల్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన మోటార్ బైకులు, కార్లను గురువారం సాయంత్రం వేలం వేయగా ప్రభుత్వానికి రూ.10.08 లక్షలు ఆదాయం వచ్చింది. గురువారం రాత్రి ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరిండెంట్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. సర్కిల్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన 5 బైకులు, కార్లు, ఫార్చినర్ వాహనాలను వేలం వేసినట్లు చెప్పారు. జీఎస్టీతో కలిపి రూ.10,08,310 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. సెబ్ ఎస్‌ఐ సత్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.

ఇద్దరు చిన్నారులకు డెంగ్యూ

దేవనకొండ: మండలంలోని కుంకనూరు గ్రామం ఎస్సీ కాలనీలోని నాలుగేళ్ల వయస్సున్న ఇద్దరు చిన్నారులకు డెంగ్యూ నిర్ధారణ కావడంతో ఆదోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు. గత కొన్ని రోజులుగా పిల్లలకు తీవ్ర జ్వరం రావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం ఆదోని ఆస్పత్రికి తీసుకెళ్లామని, అక్కడ వైద్యులు పరీక్షించి డెంగ్యూ జ్వరమని చెప్పారన్నారు. సంబంధిత అధికారులు గ్రామంలో నివారణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఘనంగా కాశిరెడ్డి నాయన ఆరాధన

వెల్దుర్తి(కృష్ణగిరి): శ్రీరంగాపురం కొండల్లో ఏర్పాటైన నిత్యాన్నదాన క్షేత్రం కాశిరెడ్డినాయన ఆశ్రమంలో అవధూత కాశిరెడ్డినాయన, సమీప కోటపేట ఆంజనేయ స్వామి వార్ల 14వ ఆరాధన ఉత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. నిర్వాహకులు రామచంద్రారెడ్డి, శ్రీరంగాపురం గ్రామస్తుల ఆధ్వర్యంలో ఉత్సవాలు ఉదయం గణపతి పూజతో ప్రారంభమయ్యాయి. కాశిరెడ్డినాయనకు పల్లకీసేవ, ఊరేగింపు, అనంతరం కోటపేట ఆంజనేయస్వామితో పాటు ఆశ్రమం పక్కనే వెలసిన అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వర స్వామి, లక్ష్మీ నరసింహస్వామి వార్ల ఏడవ వార్షికోత్సవం సందర్భంగా స్వామి వార్లకు, నాగప్రతిమలు, నవగ్రహాలకు, సమీప వైష్ణవ క్షేత్రంలోని పాలుట్ల రంగస్వామికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆశ్రమ ప్రాంతంలో నందికోల సేవ, జ్యోతి జ్వాల కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. రాత్రి కోలాటం సూదేపల్లె బృందం వారిచే నిర్వహించిన కట్టి కోలన్న, డీసీ కృష్ణ, రోశిరెడ్డిలచే ప్రదర్శింపబడిన పంచమాంకములు ఉచిత నాటక ప్రదర్శన అలరించాయి.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

ఆరాధనోత్సవాల్లో భాగంగా నిర్వహించిన న్యూ కేటగిరీ వృషభాల బండలాగుడు పోటీల్లో 13 జతల వృషభాలు పాల్గొన్నాయి. అనంతపురం జిల్లా ఓబుల దేవర పల్లె బెస్త శ్రీరాములు వృషభాలు విజేతలుగా నిలిచి రూ.40 వేల నగదు గెలుచుకున్నాయి. శ్రీరంగాపురం వైఎస్సార్‌సీపీ నాయకుడు మూలింటి జయన్న ప్రారంభించిన పోటీలలో 2 ,3 స్థానాలలో పాణ్యం ఎస్.కొత్తూరు బీరం బుల్స్ నిలిచి రూ.30 వేలు, రూ.20 వేలు గెలుచుకోగా, 4, 5, 6 స్థానాలలో పగిడ్యాల కొడెల గిరిజ, అనంతపురం జిల్లా జీరం బ్రదర్స్ అండ్ జీఎంఆర్ బుల్స్, అనంతపురం రామాంజనేయులు అండ్ ఈశ్వరప్రసాద్ వృషభాలు నిలిచి రూ.11 వేలు, రూ.7 వేలు, రూ.5 వేలు గెలుచుకున్నాయి. గుండు ఎత్తే పందెంలో ఉలిందకొండ మనోహర్ 4 తులాల వెండి పతకం, మాధవరం రాజశేఖర్ 2 తులాల వెండి పతకం గెలుపొందారు. ఆశ్రమ వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి, శ్రీరంగాపురం నాయకులు విజేతలకు బహుమతులందించారు.

శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ట



ఆలయంలో ప్రతిష్ఠించిన త్రయంబకేశ్వర స్వామి



కలశాన్ని ఊరేగింపుగా తీసుకొస్తున్న గ్రామస్తులు



పాల్గొన్న మహిళలు



పూజలందుకుంటున్న అమ్మవారు

కౌతాళం: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన త్రయంబకేశ్వర స్వామి ఆలయం ప్రారంభోత్సవం గురువారం శాస్త్రోక్తంగా సాగింది. పాల్తూరు మఠం పీఠాధిపతి చెన్నవీర శివచార్య సాములు, రౌడూకుంద మఠం పీఠాధిపతి శివయోగి మహాస్వాములతో పాటు శ్రీశైల దేవస్థానం ఉప ప్రధాన అర్చకుడు మఠం శివశంకరయ్య స్వామి వేదమంత్రోచ్చరణల మధ్య తెల్లవారుజామున నాల్గు గంటల నుంచి సుప్రభాత సేవ, మహామంగళ హారతి, కుంకుమార్చన, బిల్వార్చన వంటి ప్రత్యేక పూజల అనంతరం త్రయంబకేశ్వర స్వామి, పార్వతి దేవి, గణపతి వివిధ విగ్రహాలను ప్రతిష్ఠించారు. ధ్వజస్తంభం ప్రతిష్ఠతో పాటు ఆలయం పైన కలశ ప్రతిష్ఠను సంప్రదాయబద్ధంగా జరిపించారు. శివనామస్మరణల మధ్య శుభ ముహూర్తంలో జరిగిన ఈ మహోత్సవాన్ని భక్తజనం కనులారా తిలకించి పరవశించిపోయారు. నూతన ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా ఈ నెల 11 నుంచి 21వ తేదీ బుధవారం వరకు బసవేశ్వరస్వామి పురణా ప్రవచన కార్యక్రమాన్ని 11రోజుల పాటు వైభవంగా నిర్వహించారు. ప్రతి రోజు హోమాలు, వివిధ పూజలు, గ్రామంలో విగ్రహాల ఊరేగింపు చేశారు. ఈ సందర్భంగా పీఠాధిపతులు మాట్లాడుతూ.. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల వల్ల గ్రామాల్లో శాంతి, సోదరభావం ఏర్పడుతుందన్నారు. అందరు కలిసిమెలసి శాంతి మార్గాన్ని అవలంభించాలన్నారు. ఆలయ ప్రారంభోత్సవం పురస్కరించుకుని గ్రామంలో పండుగ వాతవరణం తలపించింది.

నేటి నుంచి లాలుస్వామి ఉరుసు

కృష్ణగిరి: కొలిచే వారికి కొంగు బంగారమై, ఆపదలో అదుకునే మహిమానిత్యుడు లాలుస్వామి. చిట్యాల గ్రామంలో వెలసిన భక్తుల ఆరాధ్య దైవం లాలుస్వామి ఉరుసును శుక్రవారం నుంచి మూడు రోజులు జరుపుకుంటున్నట్లు దర్గా ఉత్సవ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు.

మూడు రోజులు పాటు కార్యక్రమాలు...

ఉరుసు సందర్భంగా గ్రామంలో మూడు రోజులు పాటు పండుగ వాతావరణం ఉంటుంది. శుక్రవారం మధ్యాహ్నం రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించి విజేతలకు దాతల సహాయంతో వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల నగదు బహుమతులు అందించనున్నారు. ఇదే రోజు రాత్రి 11 గంటల నుంచి గంధం సమర్పిస్తారు. 24న అత్యంత భక్తిశ్రద్ధలతో ఉరుసు నిర్వహించి స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. 25న కిస్తీతో ఉరుసు ముగుస్తుంది.

వృషభాల బండలాగుడు పోటీలు

ఉరుసు సందర్భంగా 25న రాష్ట్రస్థాయి పాలపండ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నారు. గెలుపొందిన వృషభాల యజమానులకు కమిటీ తరపున దాతల సహకారంతో వరుసగా రూ.60 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలను అందజేయనున్నారు. పోటీల్లో పాల్గొనే వారు రూ.500 ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని, వివరాలకు 99890 28249, 94406 37027 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు. గ్రామానికి చెందిన శ్రీనివాసమూర్తి, హరిప్రియ దంపతుల సహకారంతో మూడు రోజులపాటు భక్తులకు అన్నదానం చేయనున్నారు.